PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....



ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 111 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, | గురువారం, జూన్ 11, 2026 | వెల రూ.5/-

## దేశం కోసం ఏర్పడ్డదే ఎన్డీయే

- జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన
- దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపచేసిన మోడీ
- ఎన్డీయే పక్షాల భేటీలో మోడీని అభినందించిన బాబు

**న్యూఢిల్లీ,జూన్10 (నేటి శుభోదయ):** దేశాభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తి.. ప్రధాని మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రసంగించారు.



ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచదేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధికి కూడా కేంద్రం పూర్తిగా మద్దతిస్తోందన్నారు. ఎన్డీయే ఏర్పడింది ఎన్నికల కోసం కాదు.. దేశం కోసం. అధికారం కోసం కాదు.. జాతీయ ప్రయోజనాల కోసం. రాష్ట్రాల్లో ఎన్డీయే సాధిస్తున్న వరుస విజయాలే మా పనితీరుకు సాక్ష్యం.

బిహార్, అస్సాం, పుదుచ్చేరిలో ప్రజలు మళ్లీ మాకు పట్టం కట్టారు. ఆయా రాష్ట్రాల్లో ఈ విజయాలు.. సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. బెంగాల్.. మళ్లీ దేశానికి (మిగతా 2లో..)




## కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...
# వేలకోట్ల కుంభకోణాలు

- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం

**న్యూఢిల్లీ,జూన్ 10 (నేటి శుభోదయ):** కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. (మిగతా 2లో..)

## మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం..

**దేశానికే అంకితమైన మోడీ జీవితం: పవన్ కళ్యాణ్**

**అమరావతి,జూన్10(నేటి శుభోదయ):** దేశ సేవలో ప్రధాని మోదీ 4,399 రోజుల పాలన పూర్తి అయ్యిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ స్పందిస్తూ.. మోదీ సేవలను కొనియాడారు. 'మాతృ భూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం.. దేశానికే అంకితమైన జీవితం' అని అన్నారు. దేశానికి నిస్వార్థ సేవ చేస్తున్న ప్రధానమంత్రి మోదీ, ఎన్డీఏ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 12



ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌ను బలమైన దేశంగా తీర్చిదిద్దిందని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ భద్రత మరింత పటిష్ఠమైందని, ఆధునికీకరణ దిశగా భారత సాయుధ దళాలకు కొత్త శక్తి వచ్చిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌కు కీలక స్థానం లభించిందని, జీ-20 సమ్మిట్ విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రపంచ దృష్టి భారత్ వైపు మళ్లిందని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్‌కు బలమైన స్వరంగా భారత్ ఎదిగిందని వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా విప్లవం ద్వారా ప్రజలకు సేవలు చేరువ య్యాయని పవన్ అన్నారు. జనధన్-ఆధార్-మొబైల్ అనుసంధానంతో పారదర్శక పాలన సాధ్యమైందని చెప్పారు. యూపీఐ, డీబీటీ వ్యవస్థలతో డిజిటల్ చెల్లింపులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద కోట్ల మందికి వైద్య భరోసా లభిస్తోందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు సొంత ఇళ్ల (మిగతా 2లో..)

## ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం



- ఆధునిక భారతం ఆవిష్కరించిన నెహ్రూ
- 12 ఏళ్ల సుదీర్ఘ పాలనపై జైరామ్ రమేశ్ ఎద్దేవా

**న్యూఢిల్లీ,జూన్10(నేటి శుభోదయ):** ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. ఎన్నికైన ప్రధానుల్లో నిరంతరాయంగా సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ రికార్డు సృష్టించారు. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ మోదీపై విమర్శలు గుప్పించింది. ఆయన స్వయంప్రకటిత మైలురాయిని దాటారేమో కానీ, దేశానికి పెద్ద సమస్యగా పరిణమిం చారని కాంగ్రెస్ సీనియర్ నేత (మిగతా 2లో..)

## ఉక్కు ఉద్యోగులతో చెలగాటమాడిన జగన్



**విశాఖను కాపాడిన ఘనత తమదే: లోకేశ్**

**అమరావతి,జూన్10(నేటి శుభోదయ):** విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రజలు పోరాడిన చరిత్రను గుర్తు చేస్తూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రెండుసార్లు కాపాడిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. (మిగతా 2లో..)

## నిర్ణీత వ్యవధిలో విద్యుత్ ప్రాజెక్టుల పూర్తి



- విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి,జూన్10(నేటి శుభోదయ):** రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల నిర్మాణాలను నిర్ణీత కాల వ్యవధి లోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. బుధవారం అమరావతిలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో (మిగతా 2లో..)

## విజయం సాధించడమే లక్ష్యంగా మోడీ ఎత్తులు



- అంటరాని పార్టీ అన్న ముసుగును తొలగించుకున్న బిజెపి
- బిజెపిని ప్రజలకు చేరువ చేయడంలో మోడీ విజయం
- ప్రాంతీయ పార్టీల నేతలు మోడీతో దోస్తీకి రెడీ
- ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేలా కార్యక్రమాలు

**న్యూఢిల్లీ,జూన్10(నేటి శుభోదయ):** బిజెపి అంటే ఒకప్పుడు అంటరాని పార్టీ. బీజేపీ అంటే బ్రాహ్మణుల పార్టీ అనే భావన. కానీ ఇప్పుడా భావన లేదు. బిజెపి సిద్దాంతాలను పూర్తిగా మార్చేసిన ఘనత మోడీదే. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బీజేపీలో చేరాలంటే ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాలనే నిబంధనలకు నీళ్లొదిలారు. ఎవరైనా చేరొచ్చని, బీజేపీ కూడా మిగతా పార్టీల్లాంటిదేనని లిబరల్ లుక్ ఇచ్చారు. బీజేపీ అంటే (మిగతా 2లో..)



## విశాఖ స్టీల్ ప్లాంట్ మరణాలు ప్రభుత్వ హత్యలే

- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాల్సిందే మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టీకరణ
- విశాఖపట్నంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్
- తప్పుల్ని ప్రశ్నిస్తే లోకేష్ కు ఫ్రస్టేషన్ ఎందుకు ?
- పరామర్శకు వచ్చి ఎందుకంత అసహనం ?
- సూటిగా ప్రశ్నించిన గుడివాడ అమర్నాథ్

## భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

- కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం
- బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు



**విశాఖపట్టణం, జూన్10(నేటి శుభోదయ):** స్టీల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. బుధవారం విశాఖను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ఎలాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని జగన్ ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని (మిగతా 2లో..)



## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

- కేంద్ర కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా నిర్మాణాలు
- రూ.2,500 కోట్లతో ఐదు ఎకరాల్లో నిర్మాణానికి అనుమతి
- 17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెసిడెన్షియల్ కాంప్లెక్స్
- కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందన్న మంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ,జూన్10(నేటి శుభోదయ):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక (మిగతా 2లో..)

## స్టీల్‌ప్లాంట్ పదం పలికే అర్హత కూడా లేదు

- ఐదేళ్ల పాలనలో ఏనాడూ ప్లాంట్‌ను సందర్శించని జగన్
- ప్రమాదం జరిగితే రాజకీయాలు చేయడం సబబా
- పాయకరావు పేట అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్న అనిత



**అనకాపల్లి,జూన్10(నేటి శుభోదయ):** స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన కార్మికులను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్ ఆస్పత్రికి వచ్చినా ఆయన పార్టీ కార్యకర్తలు ఏవేవో నినాదాలు చేశారని విమర్శిం చారు. సీఎం హోదాలో జగన్ ఎప్పుడైనా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లారా? అక్కడి కార్మికుల సమస్యల (మిగతా 2లో..)

## కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...

# వేలకోట్ల కుంభకోణాలు

(మొదటి పేజీ తరువాయి)

గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తున్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉండని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు.

తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములవ్వాలని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.

సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తెలిపోయిందని ఉద్ఘాటించారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా



వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారతదేశం వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించామని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ఉక్కు ఉద్యోగులతో

# చెలగాటమాడిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బలోపేతం చేయడానికి కృషి చేసిన తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వైసీపీ తన గత వైఖరిని గుర్తు చేసుకోవాలని లోకేష్ సూచించారు. రాజధాని నిర్మాణం పేరుతో స్టీల్ ప్లాంట్ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జగన్ ప్రభుత్వ హయాంలో జరిగాయని ఆయన ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ కాలుష్యం పేరుతో కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో బాధితులను పరామర్శించడం తప్పు కాదని, అయితే ఆ సందర్భాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదన్నారు. స్టీల్ ఎలాంట్ లేకుండా చేయాలని కుట్ర పన్నిన జగన్ అదే విశాఖలో కార్మికులకు క్షమాపణ చెప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు.

## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

(మొదటి పేజీ తరువాయి)

ముందడుగు వేసింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించిన వివరాల ప్రకారం, అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అమరావతి నిర్మాణానికి మరింత ఊతమివ్వనుంది. ప్రణాళిక ప్రకారం 5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక ఆఫీస్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. ఇందులో రెండు భారీ టవర్లను ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకుని రానున్నారు. అలాగే 1,800 కార్లకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పించేలా ఆధునిక మౌలిక వసతులతో ఈ కార్యాలయ సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇదే ప్రాజెక్టులో భాగంగా రూ.1,234 కోట్ల వ్యయంతో 17 ఎకరాల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను కూడా నిర్మించనున్నారు. 11 టవర్లలో మొత్తం 1,568 నివాస క్వార్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పెమ్మసాని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో కూడిన గేటెడ్ కమ్యూనిటీగా ఈ నివాస సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. 2018లో తొలిసారిగా ప్రతిపాదించబడిన ఈ ప్రాజెక్టు పలు కారణాలతో ముందుకు సాగకపోయినా, 2024 తర్వాత వేగం పుంజుకుని ప్రస్తుతం ఆమోద దశకు చేరుకుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, కేంద్ర ఆర్థిక శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారం వల్లే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమరావతిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు రాజధాని అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర పడిందని వివరించారు.

# స్టీల్‌ప్లాంట్ పదం పలికే అర్హత కూడా లేదు

(మొదటి పేజీ తరువాయి)

గురించి మాట్లాడారా? మృతుల కుటుంబాలకు స్టీల్‌ప్లాంట్, కేంద్రం, రాష్ట్రం పరిహారం ఇచ్చాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి కంటే ఎక్కువ పరిహారం అందుతుంది. చనిపోయిన ఒప్పంద కార్మికుల కుటుంబానికి కూడా పరిహారం, ఉద్యోగం ఇస్తున్నాం. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయంగా విమర్శలు సరికాదని మంత్రి అనిత అన్నారు.జగన్ మోహన్ రెడ్డి హయాంలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.5.46 కోట్లు కేటాయించి, పనులు చేపట్టామని పేర్కొన్నారు.రాబోయే మూడేళ్లలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని అనిత వ్యాఖ్యానించారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రెండేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై హోంమంత్రి అనిత మీడియా సమావేశం నిర్వహించారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఫొటోలతో సహా వివరించారు. ÷ాయకరావుపేట నియోజకవర్గంలో రెండేళ్లలో సుమారు రూ.1,150 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అనిత చెప్పుకొచ్చారు.పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలోని పంచాయతీరాజ్‌లో 871 పనులకు గానూ, రూ.118 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి కోసం 172 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించామని తెలిపారు.

పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్ బీలో 36 పనులకు గానూ 137 కిలోమీటర్ల రోడ్డు, రూ.130 కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించటం కోసం రూ. 66 కోట్లతో 244 పనులు చేపట్టామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో జగన్‌మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును



ప్రశ్నించిన ఆయన, బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రానికి రెండు లేఖలు కూడా రాశామని అన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల పక్షాన నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై గట్టిగా కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం సుమారు 10,500 మందిని తొలగించారని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్ట్, రెగ్యులర్ కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్ ఎలాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వ నేతలు చెబుతున్నారని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇచ్చిందని గుర్తు చేసిన జగన్, అదే తరహాలో స్టీల్ ఎలాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని జగన్ కోరారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు కొంత ఓపిక పట్టాలని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోటి రూపాయల పరిహారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి బయలుదేరారు.

# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్డీయే

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గర్లోనే ఉంది. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పాలన, ఆవిష్కరణలే భారత్‌కు అతిపెద్ద బలం. అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి భారతీయుడి మనోభావాలు అర్థం చేసుకున్న నాయకుడు.. మోదీ అని చంద్రబాబు అన్నారు. ప్రధానిగా మోదీ గత 12 ఏళ్ల ప్రయాణం.. భారత ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. దేశం గర్వించేలా చేయడంతో పాటు, ప్రపంచదేశాల్లో భారతదేశ గౌరవం పెంచేలా ప్రధాని మోదీ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న రాష్ట్రాల అభ్యున్నతికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మద్దతుగా ప్రధాని నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసం ఏర్పడుతాయని.. కానీ ఎన్డీఏ కూటమి ఎన్నికల కోసం కాదని... దేశం కోసం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అధికారం కోసం కాదని... జాతీయ లక్ష్యసాధన కోసం ఎన్డీఏ ప్రయాణం సాగుతోందని తెలిపారు. దీనికి రాష్ట్రాల్లో వరుసగా ఎన్డీఏ సాధిస్తున్న విజయాలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. బీహార్‌లో 243 స్థానాల్లో 202 స్థానాల్లో గెలుపు ఎన్డీఏపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అసోం గెలుపు మరోసారి విశ్వాసం వ్యక్తం చేసిందని.. పుదుచ్చేరి విజయం కూడా మరోసారి ఎన్డీఏకి మద్దతు తెలిపిందని ప్రస్తావించారు. ఇవి కేవలం ఎన్నికల ఫలితాలు కావని... సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని అభివర్ణించారు. ఒకప్పుడు 'ఈరోజు పశ్చిమబెంగాల్ ఆలోచిస్తే... రేపు భారత్ ఆలోచిస్తుంది' అనే పేరు ఉండేదని చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాల పాటు పశ్చిమబెంగాల్ అభివృద్ధి ప్రధాన స్రవంతికి దూరమైందని తెలిపారు. దేశ సంస్కరణలు, అభివృద్ధి వైపు సాగితే... పశ్చిమబెంగాల్ పాత రాజకీయాల్లోనే చిక్కుకుపోయిందని అన్నారు. తాజా మార్పుతో పశ్చిమబెంగాల్ దిశ మళ్లీ అభివృద్ధి వైపు సాగనుందని వివరించారు. మారుతున్న భారత ఆకాంక్షలకు అనుగుణంగా బెంగాల్ అడుగులు వేస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బెంగాల్ మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గరలోనే ఉందని ప్రస్తావించారు. భారతీయత పునరుజ్జీవం పొందడం గత 12 ఏళ్లలో వచ్చిన అతిపెద్ద మార్పు అని పేర్కొన్నారు. వికాస్ బీ... విరాసత్ బీ నూతన భారత నిర్మాణానికి మార్గదర్శకమని ఉద్ఘాటించారు. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పరిపాలన, ఆవిష్కరణల సమన్వయమే నూతన భారత్ బలమని తెలిపారు. 21వ శతాబ్దానికి భారత్ అందించే గొప్ప సందేశం ఇదేనని.. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ దేశానికి ఉన్న అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. వ్యవస్థను పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రధాని తీర్చిదిద్దుతున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. మన కాలంలో అత్యుత్తమ రాజకీయవేత్తల్లో మోదీ ఒకరని ఉద్ఘాటించారు. ప్రపంచ మార్పులో భారత్ భాగస్వామినే కాదని... దిశానిర్దేశర చేసే దేశంగా భారత్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రజాస్వామ్య హత్యకు మోడీ సారథ్యం

(మొదటి పేజీ తరువాయి)

జైరాం రమేశ్ పేర్కొన్నారు. మోదీ పాలనకు కాకుండా దేశంలో ప్రజాస్వామ్య హత్యకు సారథ్యం వహిస్తున్నారని అన్నారు. 1947 ఆగస్టు 15న జవహర్‌లాల్ నెహ్రూ ఒక అద్భుతమైన మంత్రివర్గానికి అధ్యక్షత వహించి.. భారత ప్రధాని అయ్యారని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అరుదైన ఆ మంత్రివర్గం పాలనలో ఐదేళ్లలోనే ఆధునిక భారతం ఆవిర్భవించిందన్నారు. 560కి పైగా రాచరిక రాష్ట్రాలను శాంతియుతంగా భారత యూనియన్‌లో విలీనం చేశారని.. భారత రాజ్యాంగాన్ని ఆమోదించారని అన్నారు. దేశంలోని జమీందారీ వ్యవస్థ రద్దు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, నీటిపారుదల ప్రాజెక్టులు వంటి నిర్ణయాలతో దేశం ప్రపంచ వ్యవహారాల్లో ఒక శక్తిగా ఆవిర్భవించిందన్నారు. 1947-52 మధ్య నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశం నెలకొల్పిన రికార్డులను మోదీ చరిత్ర నుంచి చెరిపేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. 1952, 1957, 1962 ఎన్నికల్లో నెహ్రూ భారీ మెజారిటీతో విజయం సాధించగా.. 2024లో మోదీకి కనీస మెజారిటీ కూడా రాలేదని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ప్రధాని కావడానికి ఎన్డీఏ నేతలకు తాయిళాలు ఇచ్చి మద్దతు కూడగట్టుకోవాల్సి వచ్చిందన్నారు. మోదీ పరిపాలనలో స్వతంత్ర ఎన్నికల సంఘం, పవిత్రమైన ఓటర్ల జాబితా వంటి ప్రజాస్వామ్య వ్యవస్థలు ముప్పులో పడ్డాయన్నారు. పేపర్ లీక్‌ల కుంభకోణాలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ ఆస్తులను కొందరు ధనవంతుల పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను బలహీనపరుస్తున్నారని విమర్శించారు.

## మాతృభూమిపై గౌరవం.. కర్మభూమిపై సంక్షేమం..

(మొదటి పేజీ తరువాయి)

కల సాకారమవుతోందని పవన్ ప్రస్తావించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు సదుపాయం కల్పించారన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల్లో భారీ అభివృద్ధి సాధించారని చెప్పారు. వందే భారత్ రైళ్లతో రవాణా రంగంలో కొత్త శకం మొదలైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయ మని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్ 2047 సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామ్యం వహిస్తుందన్నారు. భిన్నత్వమే భారతదేశ బలమని, భాషలు భారత గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, విభజన శక్తులను ధీటుగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. జై హింద్.. జై భారత్ అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నిర్ణీత వ్యవధిలో విద్యుత్ ప్రాజెక్టుల పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సబ్‌స్టేషన్ల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ అంతరాయాలు,లో ఓల్టేజ్ సమస్యలు రాకుండా సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అధికారులకు సూచించారు.ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలలో సరఫరాను పునరుద్ధరించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ కేబులింగ్ వ్యవస్థతో భవిష్యత్తులో అత్యవసర సర్వీసులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ దేవాలయాల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినప్పుడు.. తక్షణ పునరుద్ధరణకు గల అవకాశాలపై ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి చర్చించారు. ఈ సమీక్షకు ట్రాన్స్ కో జేఎండీ, సీపీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లు హాజరయ్యారు.

# విజయం సాధించడమే లక్ష్యంగా మోడీ ఎత్తులు

(మొదటి పేజీ తరువాయి)

పెద్దగా ఆసక్తి లేనివాళ్లు, అసలు రాజకీయాలపై ఇంట్రస్ట్ లేని వాళ్లు కూడా మోడీని చూసి పార్టీలో చేరుతున్నారని బీజేపీ నేతలే ఒప్పుకుంటున్న పరిస్థితి. ఆ స్థాయిలో బీజేపీలో మోడీ హవా నడుస్తోంది. వరుస ఎన్నికల్లో విజయాలు ఆయనకు ఆషామాషీగా రాలేదు. అవినీతి కనిపించని పాలన, జనాన్ని ఆకట్టుకునే ప్రసంగాలు, ప్రత్యర్థుల్ని ఆశ్చర్యపరిచే వ్యూహాలు.. ఇలా మోడీ అమ్ముల పొదిలో చాలా అస్త్రాలున్నాయి. దేశంలో కాంగ్రెస్ ధాటికి తట్టుకోలేక ప్రాంతీయ పార్టీల ప్రాపకం కోసం చూస్తున్న బీజేపీకి.. మోడీ ఆశాకిరణంలా దొరికారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి అన్ని పార్టీలూ అర్రులు చాస్తున్నాయంటే.. దానికి మోడీ మ్యాజిక్కే కారణం.కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా బీజేపీలో ఎదిగిన మోడీ.. ఇప్పుడు పార్టీలో సర్వంసహా ఆధిపత్యాన్ని సంపాదించారు. మరే నేతకూ సాధ్యం కాని రీతిలో కొంతవరకు వ్యక్తిపూజ సంస్కృతిని కూడా తీసుకొచ్చారు. పార్టీ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. దేశంలో రాజకీయం చేయడం ఒక ఎత్తైతే.. ఎన్నికల రాజకీయం మరో ఎత్తు. చాలా మంది నేతలకు ఈ సూక్ష్మం తెలియకనే రాజకీయ తెరపై కొంతకాలం వెలిగి తెరమరుగైపోతున్నారు. కానీ మోడీ మాత్రం ఎన్నికల రాజకీయాన్ని పూర్తిస్థాయిలో ఔపోసన పట్టారు. అసలు ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండగ అని ప్రకటించిన తొలి అగ్రనేత మోడీనే అంటే అతిశయోక్తి కానే కాదు. మిగతా నేతల్లా ఎన్నికలప్పుడే వాటి గురించి ఆలోచించే నేత కాదు మోడీ. అనుక్షణం ఎన్నికల చుట్టే ఆయన ఆలోచనలు తిరుగుతాయి. ప్రధానిగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే చాలనుకునే వ్యక్తి కూడా కాదు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం దక్కింది కొన్నాళ్లు రిలాక్స్ అవుదాం అని కూడా మోడీ ఆలోచించరు. ఎప్పటికప్పుడు జరుగుతున్న ఎన్నికల గురించే కాకుండా.. జరగబోయే ఎన్నికల గురించి కూడా ఆలోచించటం ఆయన నైజం. అంతకుముందు ఎన్నికలొస్తే చాలు అన్ని పార్టీల మాదిరే బీజేపీ కూడా టెన్షన్ పడేది. పైస్థాయి నేతలకు తగ్గట్టుగానే కిందిస్థాయిలో కార్యకర్తలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉండేవారు. కానీ మోడీ వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఎన్నికలు వస్తే బీజేపీ మరింత ఉత్సాహంగా పనిచేస్తోంది. పై స్థాయి నుంచి కిందిస్థాయి సరికొత్త వ్యూహరచన కనిపిస్తోంది. దీనికి మోడీ ఇచ్చిన స్ఫూర్తే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎన్నికల్ని పండగలా సెలబ్రేట్ చేసుకుని.. ప్రజల ఆశీర్వాదం తీసుకునే అద్భుత అవకాశంగా చూడాలనే మోడీ సరికొత్త థియరీ.. ఎన్నికల విషయంలో బీజేపీ దృక్పథాన్నే మొత్తంగా మార్చేసింది. అప్పటి నుంచి ఆ పార్టీకి ఎప్పుడూ ఊహించని ఫలితాలు చాలా అలవోకగా వస్తున్నాయి. కొన్నిసార్లు బీజేపీ సాధిస్తున్న ఫలితాల్ని చూసి.. ప్రత్యర్థులు కూడా ఏదో జరిగిందని అనుమానించే పరిస్థితి. కొందరు ప్రత్యర్థులు బీజేపీ గెలుపు సూత్రాల్ని కొంతవరకు అర్థం చేసుకున్నా.. ఇంతవరకూ ఎవరూ పూర్తిస్థాయిలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయారు. ఎన్నికల విషయంలో మోడీ పనితీరు, ఆలోచన పద్ధతి ఎలా ఉంటుందో చెప్పటానికి ఆయన సుదీర్ఘ రాజకీయాన్ని పరిశీలించాల్సిన పని లేదు. గత రెండేళ్ల కాలంలో ఆయన వ్యవహారశైలి చూస్తే సరిపోతుంది. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీకి విసుగు లేదు. అలుపు రాదు. తాను ప్రచారం చేసే రాష్ట్రంలో బీజేపీ గెలుపు అవకాశాలు, పార్టీ అస్తిత్వం.. ఇవేవీ ఆయనసలు పట్టించుకోరు. ఏ రాష్ట్రంలో అయినా.. ఏ ప్రాంతంలో అయినా బీజేపీ జెండా ఎగిరేలా చేయటానికి తనకు చేతనైనంత పని చేయాలనే ఏకైక లక్ష్యంతో మోడీ పనిచేస్తారు. ఎన్నికల ప్రచారం అంటే మూస పద్ధతుల్లో కాకుండా.. రాష్ట్రాన్ని బట్టి.. అక్కడి ప్రజల ఆలోచన తీరును బట్టి.. శైలి మార్చుకోవాలని ఆయన సూచిస్తారు. స్వయంగా పాటిస్తారు కూడా. బీజేపీ ఎంత ప్రచారం చేసినా.. దక్షిణాదిలో అనుకున్న ఫలితాలు రావడం లేదన్న ఆ పార్టీ నేతల మాటల్ని ఆయన లైట్ తీస్కుంటారు. గెలిచేదాకా ప్రచారం చేస్తూనే ఉండాలంటారు. ఆ పట్టుదలతోనే గతంలో బీజేపీ గెలవని ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లో గెలిచిందనేది మోడీ నమ్మకం. ఇప్పటివరకూ కాషాయ పార్టీ ఖాతా తెరవని రాష్ట్రాల్లోనూ ఇదే సూత్రం అమలుచేయాలనేది మోడీ

వ్యూహం. ఇక్కడ కేవలం వ్యూహరచన చేయటమే కాదు.. ఆ వ్యూహాన్ని కచ్చితంగా అమలు చేయడంలోనూ ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయరు. మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న మోడీ.. ఆ రాష్ట్రాల్లోప్రచారం చేస్తూనే.. వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్‌లోనూ ప్రచారానికి వెళ్లారు. అలా చూసుకుంటే.. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీ అందరికంటే ముందుం టారని చెప్పాలి. మోడీ ఎన్నికల ప్రచారం కూడా భిన్నంగానే ఉంటుంది. తన ప్రచారానికి ఎంత ఫలితం వచ్చిందో.. తనకు తానుగా బేరీజు వేసుకుంటారు. పార్టీలో తనను అడిగేవారు ఎవరూ లేకపోయినా.. ఆత్మసాక్షికి సమాధానం చెప్పుకునేలా పనిచేయాలనుకుంటారు మోడీ. ఈ చిత్తశుద్ధితో ప్రచారం చేస్తారు కాబట్టి.. మోడీ రోడ్‌షోలు, సభలు.. చాలావరకు విజయవంతమౌతాయి. దేశంలో ఎక్కువ మంది జనం మోడీతో నేరుగా కనెక్టవుతున్నారు. భిన్నాభిప్రాయాలున్నా.. భిన్నమైన రాజకీయ పార్టీల సానుభూతి పరులుగా ఉన్నా..ఏ సందర్భంలో అయినా మోడీతో కనెక్ట్ అవుతున్నారు. మార్కెటింగ్ లో కీలకంగా భావించే పబ్లిక్ రిలేషన్ అనే పాయింట్ ను మోడీ ప్రభావశీలంగా ఉపయోగిస్తున్నారు. సక్సెస్ కూడా అవుతున్నారు. మెజార్టీ ప్రజలతో మోడీ నేరుగా సంబంధం పెట్టుకున్నారు. మోడీ మన మనిషి అని చాలా మంది అనుకునేలా చేసుకుంటున్నారు. జనంతో మోడీకి ఉన్న ఈ కనెక్షన్ సిద్ధాంతాలు, భావజాలాలు, పార్టీలకు అతీతంగా పనిచేస్తోందని ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. ఈ బలమైన బంధమే మోడీని విజేతగా నిలబెడుతోంది.




## ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్వాగతం

**న్యూఢిల్లీ, నేటి శుభోదయ:**
ఢిల్లీ పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలకడం జరిగిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## ఘనంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి వేడుకలు..

**కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):**
గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, చీరాల పేరలా ఉద్యమం ద్వారా ఆంగ్లేయులను గడగడలాడించిన ఆంధ్రరత్న, స్వాతంత్ర్య సమరయోధుల్లో ప్రముఖుడు శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వర్ధంతిని రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా



రామసేన సభ్యులు మాట్లాడుతూ తెలుగు నాట జానపద కళారూపాలు పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఎంతో కృషి చేసాడన్నారు. దేశం అంతా తిరిగి బ్రిటిష్ అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసాడని, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ , మంగరాతీ పద్దరాజు, తుమ్మల బుజ్జి, పదిలం చక్రారావు, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆదం మణికంఠ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాడికి ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### - ప్రిన్సిపాల్ నీల ఉష

**యాడికి, జూన్ 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :**
మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న మిగులు సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల




ప్రిన్సిపాల్ నీల ఉష ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం కోరదలచిన విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ లోపు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, అనంతరం 25వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి, సీట్లు సాధించిన విద్యార్థులకు ఈనెల 26వ తేదీన పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ నీల ఉష వివరించారు...

## జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ జన్మదిన వేడుకలు

### పాల్గొన్న బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకులు వినుకోట సురేష్

**బాపట్ల నేటి శుభోదయ, జూన్ 10 :** జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్సీ మరియు చీఫ్ విప్ పిడుగు హరి ప్రసాద్ జన్మదిన సందర్భముగా మంగళగిరి తన కార్యాలయములో కలిసి జన్మదిన శుభా కాంక్షలు తెలపడము జరిగింది ఈ



కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్, కారుమూరి ఆంజనేష్ ,గొట్టిపాటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం

### మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు

**దేవీపట్నం జూన్10 నేటి శుభోదయం**
దేవిపట్నం మండలం బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు బుధవారం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు ఆధ్వర్యంలో బూత్ స్థాయి నుండి మండల స్థాయి వరకు జరిగిన ఈ సమావేశంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

?ఈ సందర్భంగా మండల ఇరువురి నాయకులు మాట్లాడుతూ.. మాట్ల యూనిట్ పరిధిలో తప్పనిసరిగా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో, కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయడమే ఏకైక లక్ష్యంగా క్షేత్రస్థాయిలో దూసుకుపోవాలని కోరారు.

?"పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు క్లస్టర్ ఇంచార్జి ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల



అధ్యక్షులు తైలం గంగాధర్, ముంద్రు మధుసూదన్ రావు, పోశమ్మ గండి చైర్మన్ మలుగుల శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కారం పోచమ్మ, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రేలంగి రాంబాబు, నియోజకవర్గ ఉపాధ్యక్షులు అడబాల వీరభద్రం, చవళం శివరామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షులు పోతుల వాసు, గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్ధ వాసు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ముచ్చు బాబురావు, ఏరియా ఇంచార్జ్ కుంజం రాజామణి, ఏరియా ఇంచార్జ్ కర్రి రాజీవ్, కో కన్వీనర్ ఈత శివాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నేసికి కోటేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్, రైతు కమిటీ కార్యదర్శి ఈరేటి బ్రహ్మాజీ , కార్యదర్శి కొణితల చిట్టిబాబు, గండి డైరెక్టర్ సూరి వెంకటేశ్వరరావు, భూత్ ఇంచార్జ్ పోతులు వీర పండు, భూత్ ఇంచార్జ్ దబ్బా నాని, గండి డైరెక్టర్ కళ్యాణి, గనిశెట్టి వీరబాబు, మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.











# తుంగభద్ర వారియర్స్ జట్టు వైస్ కెప్టెన్‌గా మచ్చా దత్త రెడ్డి ఎంపిక

**అనంతపురం, నేటి శుభోదయ:**
అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్ రంజీ క్రీడాకారుడు మచ్చా దత్తారెడ్డి నీ తుంగభద్ర వారియర్స్ టీంకు వైస్ కెప్టెన్ గా ఎంపిక చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల హైదరాబాదులో చెన్నై జట్టు ఇతర టీములతో జరిగిన పోటీలలో అద్భుత ప్రదర్శన చేయడంతో వైస్ కెప్టెన్ గా అవకాశం లభించింది.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆంధ్ర ప్రీ మియర్ లీగ్ ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని తుంగభద్ర వారియర్స్ జట్టుకు అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చ దత్తారెడ్డి వైస్ కెప్టెన్ గా ఎన్నికయ్యారు. మచ్చ దత్త రెడ్డి ఆంధ్ర జట్టుకు అండర్ 14 అండర్ 16 అండర్ 19 అండర్ 23 సీనియర్ రంజి జట్టుకు ఆడిన విషయం తెలిసింది. రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక మ్యాచ్లో అద్భుత ప్రదర్శన కనబరిచారు ఈ విషయాన్ని తుంగభద్ర వారియర్స్ జట్టుఅధికారికంగా ప్రకటించింది. ఈనెల 30వ తేదీ వరకు విశాఖపట్నం, కడప, మంగళగిరి ప్రాంతాల్లో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఏపీ ఎల్ క్రికెట్ పోటీలు జరుగుతాయి.

# సంస్కారహీనుడు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

### మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపర్తి , నేటి శుభోదయ :**
మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి రెండు నెలలకు ఓసారి పుట్టపర్తికి వచ్చి ఉనికి కోసం నోటికి వచ్చినట్లు మాట్లాడి వెళుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి.

రాజకీయాలలో బ్యాలెన్స్ చాలా ముఖ్యమని ఆ బాలన్స్ కోల్పోయి నోటికి వచ్చినట్లు మాట్లాడిన వారు రాజకీయంగా ఎదిగిన దాఖలాలు లేవని, సంస్కారం లేదు కాబట్టే మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తన స్థాయిని మరిచి అందరిపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టపర్తి టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పల్లె రఘునాథ్ రెడ్డి ని పుట్టపర్తిని వేరు చేయడం ఎవరి తరం కాదన్నారు. 193 చెరువులకు నీరు ఇస్తానని చెప్పి ఐదేళ్లు అధికారంలో ఉండి ఏం అభివృద్ధి చేశావంటూ ప్రశ్నించారు. స్థాయిని మరిచి కోట్లాదిమంది అభిమానులు ఉన్న పవన్ కళ్యాణ్ ను దుర్భాసలాడడం సిగ్గుచేటు అన్నారు. రెండు నెలలకు ఒకసారి పుట్టపర్తికి వచ్చే శ్రీధర్ రెడ్డి ఎక్కడ తన ఉనికి లేకుండా పోతుందో అనే భయంతో నోటికి



వచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నారా లోకేష్ పవన్ కళ్యాణ్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చేస్తే ఎవరినైనా తాను అభినందిస్తానని, ఐదేళ్ల కాలంలో నువ్వు చేసిన గొప్పలు ఏంటో చెప్పాలన్నారు. ప్రజల గుండెల్లో నిలవాలన్నదే మా తాపత్రయం అని మీలా శంకుస్థాపన బోర్డుల లో ఉండాలనుకోమన్నారు. అవినీతి అన్యాయాలు దోపిడీ దుర్మార్గాలకు వైసిపి కేరాఫ్ అడ్రస్ అయితే సుపరిపాలన ప్రజా సంక్షేమం అభివృద్ధికి టిడిపి కేరాఫ్ అడ్రస్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ 4,000 పింఛన్ అందించడమే కాకుండా దశలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. 50 వేల కోట్ల మెజారిటీతో గెలవకపోతే ఎమ్మెల్యేగా పోటీ చేయనని బీరాలు పలికిన శ్రీధర్ రెడ్డి ఓటమి తర్వాత ఏ ముఖం పెట్టుకొని తిరుగుతున్నాడు చెప్పాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి మా లక్ష్యం అని స్పష్టం చేశారు. వివాదాలు పరిష్కరించేందుకే కృషి చేస్తాను తప్ప తప్పుడు కేసులు పెట్టించి అలవాటు తనకు లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సంస్కారహీనంగా మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు.

## ఎస్పీ విద్యాసాగర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన

# ఎన్‌యూజే (ఇండియా) న్యూఢిల్లీ జాతీయ సంఘ నేతలు

**మచిలీపట్నం, జూన్ 9 (అజయ్ నారగాని - నేటి శుభోదయ)**
నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ జాతీయ సంఘ నాయకులు కృష్ణా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వి.విద్యాసాగర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మచిలీపట్నంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్, సంఘ లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ కొండవీటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, నేర నియంత్రణలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చేపడుతున్న చర్యలను వారు అభినందించారు.



అనంతరం ఎస్పీ విద్యాసాగర్ నాయుడును శాలువాతో ఘనంగా సత్కరించి, ఎన్‌యూజే(ఐ) జాతీయ సంఘ జ్ఞాపికను అందజేశారు. మీడియా--పోలీసు శాఖల మధ్య సమన్వయం, జర్నలిస్టుల భద్రత, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ సమాజానికి వాస్తవాలను చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇరువర్గాలు పరస్పర సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, సమాజ హితానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

### టీడీపీ మండల బాడీ సమావేశంలో తీర్మానాలు

**గూడెంకొత్తవీధి, నేటి శుభోదయ,జూన్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం గూడెంకొత్తవీధి మండలంలో తెలుగుదేశం పార్టీ మండల బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై తీర్మానాలు చేశారు.మండలంలోని 16 పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి వసతులు, చెక్‌డ్యాంల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాల నిర్మాణం వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదించారు.



అలాగే జీకేవీధి మండల కేంద్రంలోని కళ్యాణ మండపానికి మంచినీటి బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రత్యేక తీర్మానం చేశారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో బుధవారం మండల బాడీ సమావేశం నిర్వహించి, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి ప్రతిపాదనలకు సంబంధించిన తీర్మానాలను రాష్ట్ర పార్టీ అధిష్ఠానానికి పంపిస్తున్నామని మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు.ఈ సమావేశంలో చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మొట్టడం శెరభన్నదొర, మాజీ జడ్పీటీసీ గంట నళిని కృష్ణ, ఎం. భూపతి, ఎం.సంతోష్, ఎం. రాజుబాబు, కాకూరి వెంకటరమణ, కొర్ర రాంబాబు, జి. నాగేశ్వర రావు, జి.సత్యనారాయణ, ఎం.గంగరాజు, ఎం.వి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, ఎం. రాంబాబు, ఎం. కామరాజు, వి. వెంకటేశ్వర్లు, శెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.







# రాయలచెరువులో ఎరువుల డీలర్లపై చర్యలు

## ఒక దుకాణం లైసెన్స్ సస్పెండ్, రెండింటికి షోకాజ్ నోటీసులు

**యాడికి, జూన్ 10, నేటి శుభోదయ: అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ**


మండలంలోని రాయలచెరువు గ్రామంలో నిబంధనలను ఉల్లంఘించి ఎరువులు విక్రయిస్తున్న డీలర్లపై బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఏపీఎయిమ్స్ యాప్ ద్వారానే రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేయాలని డీలర్లకు ముందే శిక్షణ ఇచ్చారు.

ఈ విధానం ఈనెల 8వ తేదీ నుంచి అమలులోకి వచ్చినప్పటికీ, కొంతమంది డీలర్లు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాత పద్ధతిలోనే ఎరువులను పంపిణీ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన రాయలచెరువులోని 'శ్రీ శ్రీనివాస ట్రేడర్స్' ఎరువుల లైసెన్స్‌ను 15 రోజుల పాటు సస్పెండ్ చేయగా.. 'న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్', 'మన గ్రోమోర్ సెంటర్' దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను, చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గుత్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

# జగ్గంపేట బీజేపీ 'బీఎల్ఏ'ల నియామక అధికారిగా కంబాల శ్రీనివాసరావు

- కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ...
- నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కీలక బాధ్యతలు



**కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):** కాకినాడ జిల్లా జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో భారతీయ జనతా పార్టీ (BJP) బూత్ స్థాయి ఏజెంట్లను (BLA) నియమించే అత్యంత కీలకమైన బాధ్యతలను ప్రముఖ నాయకుడు కంబాల శ్రీనివాసరావు దక్కించుకున్నారు. 2026 ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియలో భాగంగా, నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించే పూర్తి అధికారాన్ని ఆయనకు అప్పగిస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్.హరేంధీర ప్రసాద్ ఐ.ఏ.ఎస్. అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నగేంద్ర మాధవ్ సమర్పించిన అధీకృత సిఫార్సుల (ఫారం ID: BLA-1) మేరకు జిల్లా యంత్రాంగం ఈ ఉత్తర్వులను (రిఫరెన్స్ నెం: కోఆర్డ్న్ (ఎలెక్స్)–1/181/2025, తేది: 09.06.2026) విడుదల చేసింది.

### కంబాల శ్రీనివాసరావు నియామకానికి గల ముఖ్య కారణాలు

#### క్షేత్రస్థాయి పట్టు మరియు విశ్వసనీయత...

జగ్గంపేట నియోజక వర్గంలో కంబాల శ్రీనివాస రావుకు ఉన్న బలమైన కేడర్, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను గుర్తించే రాష్ట్ర నాయకత్వం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. నియోజక వర్గంలోని ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించగలరనే నమ్మకంతోనే ఆయన పేరు ఖరారైంది.

#### ఓటర్ల జాబితా పునర్విమర్శలో కీలకం....

ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక విస్తృత పునర్విమర్శ–2026 లో ప్రతి ఓటరు ఓటును సంరక్షించడం, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడంలో బూత్ స్థాయి ఏజెంట్ల (BLA) పాత్ర అత్యంత కీలకం. అలాంటి వ్యూహాత్మక పనులను నడిపించేందుకు కంబాల శ్రీనివాసరావు సరైన నాయకుడిగా పార్టీ భావించింది.

#### రాజకీయ ప్రాధాన్యత....

కాకినాడ జిల్లాలోని 7 ప్రధాన అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను జగ్గంపేట (52) బాధ్యతలను కంబాల శ్రీనివాసరావుకు కేటాయించడం ద్వారా నియోజకవర్గ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యత మరింత పెరిగింది. పార్టీ అంతర్గత వ్యవహారాల్లోనూ, ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడంలోనూ ఆయన ఇకపై అధికారికంగా వ్యవహరించనున్నారు.

ఈ ఉత్తర్వుల ప్రతిని కాకినాడ జిల్లాలోని ఎన్నికల నమోదు అధికారులు (EROs), సహాయక ఎన్నికల నమోదు అధికారులకు (AEROs) తదుపరి చర్యల నిమిత్తం కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్ డి. తిప్పె నాయక్ ద్వారా పంపడం జరిగింది. కంబాల శ్రీనివాసరావుకు ఈ కీలక బాధ్యతలు దక్కడం పట్ల జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# ఇంద్రకీలాద్రిపై పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలి

## ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు అత్యంత పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం కల్పించడమే ప్రథమ ప్రాధాన్యత అని ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం ఆయన ఆలయ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య (శానిటేషన్) నిర్వహణ తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. రాజగోపురం ప్రాంగణం, మహా మండపం మెట్ల మార్గం, ప్రధాన ఆలయ పరిసరాల్లోని ఉపాలయాల ప్రాంగణాలన్నింటినీ పూర్తి స్థాయిలో పరిశీలించారు. భక్తులు నడిచే క్యూ లైన్లు, మెట్ల మార్గాల పక్కన పాత మ్యాట్లు, వాడేసిన పైపులు, ఇనుప వస్తువులు, ఇతర వ్యర్థ



సామాగ్రి ఎక్కడికక్కడ పడి ఉండటాన్ని గమనించారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఇంజినీరింగ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల కంటికి ఏమాత్రం అసౌకర్యం కలగకుండా, ఆ వ్యర్థాలన్నింటినీ తక్షణమే అక్కడి నుండి తరలించి, ఆయా ప్రాంతాలను కెమికల్స్ మరియు నీటితో పూర్తిగా కడిగి శుభ్రం చేయాలని ఆదేశించారు. ఉపాలయాల ప్రాంగణాలలో భక్తులు విశ్రాంతి తీసుకునే చోట నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉండాలని, డస్ట్ బిన్లను ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని ఈవో ఆదేశించారు. "అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తుడు ఇక్కడి పరిశుభ్రతను చూసి మానసిక ప్రశాంతత పొందాలి. క్యూ లైన్లలో కానీ, మెట్ల మార్గంలో కానీ ఎక్కడా చెత్తాచెదారం కనిపించకూడదు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు ఉంటాయి" అని ఈవో హెచ్చరించారు. ఇకపై ప్రతి వారం పారిశుద్ధ్య నిర్వహణపై తనకు నివేదిక సమర్పించాలని శానిటేషన్ విభాగాన్ని ఆదేశించారు.

# "ఓటరు జాబితా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది"

## ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR ) కార్యక్రమాన్ని అత్యంత కీలకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం తూర్పులోని 14వ డివిజన్‌లో డివిజన్ స్థాయి నాయకులతో గద్దె అనురాధ ప్రత్యేక సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఈ నెల15 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల పరిశీలన ప్రక్రియపై పార్టీ శ్రేణులకు ఆమె సమగ్ర అవగాహన కల్పించారు. సమావేశంలో ఓటర్ల జాబితా సవరణలో పార్టీ శ్రేణుల పాత్ర, నకిలీ, అనర్హ ఓట్ల గుర్తింపు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే విధానం, బూత్ స్థాయి కార్యాచరణ, క్లస్టర్, యూనిట్‌ల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై



విస్తృతంగా చర్చించి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, నకిలీ మరియు అనర్హ ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు.

ఓటరు జాబితా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందని, అందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

జూన్ 15 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, కొత్తగా అర్హత పొందిన ఓటర్లను నమోదు చేయించాలని, మరణించినవారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కోరారు.

ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోందని, ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పనిచేసి పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందేందుకు సహకరించాలని అనురాధ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు ముల్పూరి సాయికళ్యాణి, క్లస్టర్ ఇంచార్జి చెన్నుపాటి గాంధీ, డివిజన్ అధ్యక్షులు కర్ణా రమేష్, గరిగపాటి బద్రి, రేపాకుల ప్రసాద్, వీరంకి డాంగే కుమారి, రాధారపు యల్లబాబు, కోటేశ్వరరావు, కుమార్ (భవ్య), వెంకట్రావు, కెల్లా రమేష్ నాయుడు, షేక్ ఫాతిమా, మారధాని జ్యోతి, రామావత్ ఝాన్సీ, గవిడి లక్ష్మణరావు, కనిశెట్టి కొండలరావు, బద్దిపూడి రాము, పోతూముడి నాగసాయి, లంకపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే రాము చొరవతో మంచినీటి సమస్యకు పరిష్కారం

**-జనసేన నాయకుడు వేమూరి త్రినాథ్**

**గుడివాడ, జూన్ 10(అజయ్ నారగాని - నేటి శుభోదయ):** జనసేన సెంట్రల్ ఆంధ్రా కమిటీ సభ్యులు గుడివాడ జనసేన నాయకులు వేమూరి త్రినాథ్ అరుంధతి కాలనీ మంచి నీటి సమస్య గురించి గుడివాడ శాసన సభ్యులు వెనిగండ్ల రాముతో చర్చించిన అనంతరం ఎమ్మెల్యే రాము అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే రాము మాట్లాడిన అనంతరం అధికారులు వాటర్ ట్యాంక్ ని పంపించటం జరిగింది. వాటర్ ట్యాంక్ లతో పాటుగా త్రినాథ్, జనసేన పార్టీ వీరమహిళ పడాల సౌమ్య కూడా అరుంధతి కాలనీ వెళ్లి ఇకనుంచి వారానికి రెండు రోజులు వాటర్ ట్యాంక్ వచ్చేలాగ చర్యలు తీసుకుంటామని మరియు మంచి నీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అరుంధతి కాలనీ వాసులు తమ సమస్యను పరిష్కరించినందుకు అరుంధతి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. వెనిగండ్ల రాము, వేమూరి త్రినాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాపట్ల పట్టణం 15, 16, వార్డులలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని పర్యటన

**బాపట్ల నేటి శుభోదయ, జూన్ 10:** స్థానిక వార్డు నాయకులతో కలిసి సందర్శించి స్థానిక ప్రజల నుండి వార్డుల్లో ఉన్న సమస్యలను వింటూ వెనువెంటనే అధికారులకు తక్షణ పరిష్కారం మార్గం చూపాలని ఆదేశించడం జరిగింది.

నూతనంగా బాపట్ల వచ్చి ఒకటి రెండు రోజులు అయినప్పటికీ ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో భాగంగా నిన్న డ్రైనేజీలు పూడికతీత దగ్గరుండి పర్యవేక్షించి ఈరోజు మా



సమస్యలను ఎంతో శ్రద్ధగా విని పరిష్కార మార్గం వెనువెంటనే చూపాలని ఆదేశించి నందుకు బాపట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.

ఈకార్యక్రమంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు జిట్టా శ్రీనివాసరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గాప్రసాద్ శాస్త్రి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జిట్టా ప్రమీలా రాణి, 16వ వార్డు అధ్యక్షులు పసుపులేటి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత యోగా శిక్షణతో యోగాంధ్ర 2026

**నగర ప్రజలకు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర పిలుపు**

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):** యోగాంధ్ర – ఆరోగ్యాంధ్ర 2026 కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు ఈ యోగాంధ్ర – ఆరోగ్యాంధ్ర 2026 నమోదు పోర్టల్ (https://yogandhra.ap.gov.in/?utm_sourceRchatgpt.com#/home/yoga-registration2026) లింక్ ద్వారా నమోదు చేసుకోవచ్చని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

నమోదు అనంతరం శిక్షణ కేంద్రం, తేదీ, సమయ వివరాలు సంబంధిత అభ్యర్థుల మొబైల్ ఫోన్‌కు సామీ ద్వారా వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు.




విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమాలతో పాటు యోగా పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు స్థాయి నుంచి నగర, జిల్లా, రాష్ట్ర స్థాయిల వరకు ఈ కార్యక్రమాలు విస్తరించనున్న నేపథ్యంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుండి 21 వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు నగరంలోని భవానీపురం లోని బెర్మ్ పార్క్, సత్యనారాయణపురం లోని దీ=ూ రోడ్, ఎంజీ రోడ్ లోని అంబేద్కర్ స్మృతి వనం, కృష్ణలంక లోని రివర్ ఫ్రంట్ పార్క్ ప్రాంతాల్లో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని యోగా సాధనను దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా శాశ్వత ఆరోగ్య జీవనశైలిగా అలవర్చుకోవాలని అన్నారు.ం

# ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ నేడే శ్రీకారం..!

**- ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి చేతుల మీదుగా జూన్ 11న శంకుస్థాపన..**

**కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):** రాజమహేంద్రవరానికి చెందిన జార్విస్ ఏవియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలి ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్.టి.ఓ) ఏర్పాటుకు జూన్ 11 గురువారం శ్రీకారం చుడుతోంది. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురం ధరేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే భక్తులు బలరామకృష్ణ, జిల్లాకు చెందిన ప్రజాప్రతి నిధుల చేతుల మీదగా ఈ కార్యక్రమంలో ప్రారంభించడానికి ఏర్పాటు చేశారు.




ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఉదయం రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి చేతుల మీదుగా జరగనుంది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, విమానయాన రంగ నిపుణులు పాల్గొననున్నారు. భారతదేశంలో శిక్షణ పొందిన పైలట్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జార్విస్ ఏవియేషన్ అకాడమీ సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక ఫ్లైట్ ట్రైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. మధురపూడి విమానాశ్రయంకు చెందిన ప్రాంతంలో ఈ అకాడమీ నిర్మాణం కోసం జార్విస్ ఫ్లైట్ ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



## మంచినీటి పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని

**బాపట్ల, జూన్ 10, నేటి శుభోదయ:**
బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని గడియార స్తంభం జంక్షన్ వద్ద ప్రధాన తాగునీటి పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీని కమిషనర్ ఎం.హాసిని ఈ రోజు ఉదయం పరిశీలించారు. లీకేజీ కారణంగా నీటి వృథా జరుగుతున్న విషయాన్ని గమనించిన కమిషనర్, లీకేజీని తక్షణమే సరిచేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యస్.యస్. అర్.కృష్ణారెడ్డి గారిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టి, త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పుర పాలక సంఘం పరిధిలోని తాగునీటి పైపులైన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, లీకేజీలు కనిపించిన వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.



## బాపట్ల జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారిగా ఎస్.రాజేష్ నియామకం

**బాపట్ల నేటి శుభోదయ, జూన్ 10**



స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు బాపట్ల జిల్లా శాఖ అధికారి గా ఎస్.రాజేష్‌ని ప్రభుత్వం నియమించింది. కృష్ణా జిల్లా ఉయ్యూరు డి.డి.వో.గా పనిచేస్తున్న రాజేష్‌ని పదోన్నతి పై బాపట్ల జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారిగా నియమించ బడ్డారు. బుధవారం స్థానిక ఎస్.జి.ఎస్. డబ్ల్యు. జిల్లా కార్యాలయంలో విధులలో చేరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ని రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, అడిషనల్ కోఆర్డినేటర్ విజయ్, సిబ్బంది,జిల్లా లోని పలువురు ఎం.ఎస్.వో లు, యు.ఎస్.వో లు రాజేష్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.జి.ఎస్.డబ్ల్యు అధికారి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను అర్హులైన పేదలకు అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

భారత ప్రధానిగా నరేంద్ర మోడి దేశంలోనే అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా 4,399 రోజుల పాలనా కొత్త రికార్డు..!!

## బిజెపి సీనియర్ నేత ఏపీఆర్ చౌదరి కోరుకొండ మండల అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు..

**కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):**
భారత ప్రధాని నరేంద్ర మోడి దేశంలోనే అత్యధిక కాలం పాటు నిరంతరాయంగా ఎన్నుకోబడిన ప్రభుత్వ అధినేతగా (ప్రధానమంత్రిగా) నరేంద్ర మోదీ జూన్ 10న కొత్త రికార్డును సృష్టించారు. ఇప్పటివరకు భారతదేశ తొలి ప్రధానమంత్రి అయిన జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల రికార్డును దాటి, మోదీ 4,399 రోజుల పాటు నిరంతరాయంగా అత్యధిక కాలం పాటుగా దేశ ప్రధానిగా కొనసాగిన నేతగా అరుదైన రికార్డు సృష్టించారు..ఈ సందర్భంగా బుదవారం ఉదయం ప్రసిద్ధ




కోరుకొండ శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారికి బిజెపి సీనియర్ నేత ఏపీఆర్ చౌదరి, కోరుకొండ మండల బీజేపీ అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. భారత ప్రధానిగా నరేంద్ర మోడీ మరింత కాలం యధావిధిగా కొనసాగాలని ఈ సందర్భంగా బిజెపి నేతలు అడపా సుధీర్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మద్దిపాటి రజిని, భారతీయ పార్టీ జిల్లా కిసాన్ మోర్చా నాయకులు పెనకటి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తగరంపూడి గణపతి, పచారి నరసింహమూర్తి. సామవేదం రమణి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో భారీ సామూహిక యోగా

- వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలే ముఖ్యం
- యోగా ద్వారా ఆరోగ్యవంత సమాజం: కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే రాము
- చంద్రబాబు, మోదీ యోగాను ఆదర్శంగా తీసుకుని ప్రతిరోజు యోగా చేద్దాం: ఎమ్మెల్యే రాము
- యోగా వల్ల వైద్య ఖర్చులు తగ్గి లక్షలు ఆదా.....
- 10-15 రోజులు చేస్తే అలవాటు అవుతుంది: కలెక్టర్ పిలుపు

**గుడివాడ, జూన్ 10 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ)**
వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే, వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని, యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవు తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.

అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలు బుధవారం ఉదయం గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో సందడి వాతావరణంలో జరిగాయి.లారీ, ఆటో డ్రైవర్ల అసోసియేషన్ ఇతివృత్తంతో భారీ సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం తదితరులు ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. శాసనసభ్యుడు వెనిగండ్ల రాము మాట్లాడుతూ యోగా ఆరోగ్యవంతమైన జీవనానికి మార్గదర్శకమని అన్నారు. గుడివాడ ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.ఇంత పెద్ద స్థాయిలో కార్యక్రమం నిర్వహించేందుకు అనువైన ఎన్టీఆర్ స్టేడియం ఉండటం గుడివాడకు గర్వకారణమని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి రోజు యోగాతోనే దినచర్య ప్రారంభిస్తారని, ఆయన ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి యోగానే ప్రధాన కారణమని చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యతను చాటిచెబుతున్నారని తెలిపారు. వయస్సు పెరిగినా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, క్రమం తప్పకుండా చేస్తే ఉత్సాహం, ఏకాగ్రత, పనితీరు పెరుగుతాయని అన్నారు. కనీసం 15 రోజుల పాటు నిరంతరంగా యోగా సాధన చేస్తే అది అలవాటుగా మారుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, ఇంటి వద్దే ప్రతిరోజూ యోగా సాధన చేసే అలవాటు పెంపొందించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం కూడా యోగాంధ్ర కార్యక్రమాన్ని అదే ఉత్సాహంతో కొనసాగిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో క్యూరేటివ్ హెల్త్ కేర్, ప్రివెంటివ్ హెల్త్ కేర్ అనే రెండు విధానాలు ఉన్నాయని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించడం క్యూరేటివ్ అయితే, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రివెంటివ్ హెల్త్ కేర్ అని వివరించారు.ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు యోగా అత్యుత్తమ సాధనమని ప్రభుత్వం గుర్తించి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతిరోజూ యోగా చేసే వారు మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులకు దూరంగా ఉండగలరని తెలిపారు.

అనంతరం పురిటిగడ్డ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు, యోగా శిక్షకులు శేష ప్రసన్న, నాగరాజు ఆధ్వర్యంలో అద్భుతమైన యోగా నృత్య ప్రదర్శన చేశారు. యోగా శిక్షకురాలు కే చందు తన ప్రత్యేక యోగా విన్యాసాలతో అందరినీ అబ్బురపరిచారు. వారిని కలెక్టర్, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఆర్. టి. ఓ. నిమ్మగడ్డ శ్రీనివాస్, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య,టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహనరావు ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ వాహిని, పర్యాటకశాఖ అధికారి రామ్ లక్ష్మణరావు, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ షాహిద్ బాబు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, టిడిపి నాయకులు అల్లాడ శ్రీను, జబీన్, షణ్ముఖ రెడ్డి, రేమల్లి రజనీకాంత్,జన్సీ వేమూరి త్రినాథ్,డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత శర్మ, ఎమ్మార్వో గుడివాడ ప్రసాద్, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్,డీటీ కిరణ్,తదితర ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, లారీ, ఆటో డ్రైవర్ల సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యోగా శిక్షకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలను ఎదుర్కోవడానికి పార్టీలో ఉన్న వ్యవస్థను బలోపేతం చేయాలి

**పెనమలూరు,జూన్ 10 (అజయ్ నారగాని - నేటి శుభోదయ):**
వ్యవస్థలో రెండు రకాలు ఉంటాయని ఒకటి రాజకీయం, రెండు అఫీషియల్స్ ఈ రెండు వ్యవస్థలు కోఆర్డినేషన్ చేసుకుంటూ రాష్ట్రంలో కానీ, మండలం, గ్రామపంచాయతీలో కానీ అభివృద్ధికి కృషి చేయాలని, టిడిపి పార్టీలో ఒక కొత్త వ్యవస్థ ఎన్నికల ముందే ఏర్పాటు చేసుకున్నామని క్లస్టర్, యూనిట్,బూత్ కమిటీలు వీటి ద్వారా పార్టీ ఇచ్చిన కార్యక్రమాన్ని అందర్నీ కలుపుకుంటూ నిర్వ హించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మారుమూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనందప్రసాద్, పీత గోపీచంద్‌లు అన్నారు. బుధవారం పెనమలూరు తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో జరిగిన మండల స్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకి ఎన్నికలకు వెళ్లా ల్సిందే, ఎన్నికలను ఎదుర్కొనటానికి మన పార్టీలో ఉన్న వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు.

ప్రతినెల మొదటి వారంలో క్లస్టర్, యూనిట్, బూతు కన్వీనర్లతో సమావేశం నిర్వహించాలి అనుకున్నది స్టేట్ పార్టీ నుంచి ఆదేశాలతో ప్రతి బుధవారం నిర్వహిస్తున్నామన్నారు.

యుద్ధం వచ్చినప్పుడే యుద్ధానికి సన్నిద్ధం అవ్వకుండా ముందు నుంచి ఏ విధంగా జాగ్రత్త పడతామని అదేవిధంగా ఎన్నికలు వచ్చినప్పుడు కాకుండా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూడా ఎదుర్కొనే విధంగా ఉండాలన్నారు.

ఎస్ఐఆర్ అంటే అవగాహన చాలా తక్కువ మందికి ఉంటుంది, క్లస్టర్, బూత్,యూనిట్, మండల గ్రామ, కమిటీలు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని ఓటు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. 2002లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం నిర్వహించారు, మరల 2026లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 2002 ఓటర్ లిస్టు ప్రకారంగా మ్యాపింగ్ నిర్వహిస్తారన్నారు.



నియోజకవర్గంలో మూడు లక్షల ఓట్లు ఉంటే దీంట్లో 60 శాతం మాత్రమే మ్యాపింగ్ జరిగింది. సుమారు కోటి 80 వేల మందికి మ్యాపింగ్ జరగలేదన్నారు.

ప్రతి ఓటర్ కి రెండు ఫామ్స్ ఇస్తారు, ప్రతి ఒక్కరు గుర్తింపు కార్డు కొత్త ఫోటో ఫామ్ మీద సంతకం పెట్టి ఇవ్వాలన్నారు.

బిఎల్వోస్ మ్యాపింగ్ అవని, మ్యాపింగ్ కావలసిన వారి వద్ద నుంచి అన్ని ఆధారాలు సేకరించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెనమలూరు మండలం పెనమలూరు గ్రామంలో పెనమలూరు మండల పార్టీ స్థాయి యూనిట్ టు క్లస్టర్ మండల పార్టీ గ్రామ పార్టీ బూత్ కన్వీనర్లు స్థాయిలో మీటింగ్ జరిగింది ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనందప్రసాద్, పీత గోపీచంద్,సంగీపు రంగారావు,అబ్దుల్ సలాం, గ్రామ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు,ఇర్ఫాన్ భాష,తోటకూర ఉదయ్ భాస్కరు,మాబు సుభాని, గూడవల్లి పూర్ణ, దొండపాటి సురేష్, ముసునూరి శ్రీనివాసరావు వాళ్లతో చేయించడం కోసం ముసునూరి శ్రీధర, గుజర్లపూడి బాబురావు, సుంకర రమేష్, ఎందువ రాంబాబు,కిలారి సుబ్బారావు,కిలారు శ్రీనివాసరావు, పాముల బలరాం,మోర్ల నరేంద్ర పాల్గొన్నారు.

# నూతన లడ్డూ పోటు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయండి

### ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదాల




లభ్యతను పెంచేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న "నూతన లడ్డూ పోటు" భవన నిర్మాణ పనులను బుధవారం మధ్యాహ్నం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) ఈఓ వీకే శీనా నాయక్ లు తనిఖీ చేశారు. చైర్మన్, ఈవో భవన నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను, నాణ్యతా ప్రమాణాలను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వ రరావు, సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువు లోపల అన్ని పనులను పూర్తి చేయాలని, ఎక్కడా ఆలస్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. జులై మొదటి వారం నాటికి ఈ నూతన భవనంలోనే లడ్డూ ప్రసాదాల తయారీ ప్రక్రియ (పోటు) ప్రారంభం కావాలని, దానికి అనుగుణంగా పనుల వేగాన్ని మరింత ముమ్మరం చేయాలని ఇంజనీరింగ్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే సుదూర ప్రాంతాల భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత లేకుండా, అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ నూతన లడ్డూ పోటును సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా, భక్తుల సౌకర్యార్థం ఈ ప్రాజెక్టును త్వరితగతిన అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థాన ఇంజ నీరింగ్ అధికారులు, లడ్డు పోటు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## స్టీల్ ప్లాంట్ ప్రమాదం..

### బాధితులకు కేంద్రం భరోసా!

**(నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్):** ఏపీలోని విశాఖ స్టీల్ ప్లాంట్లో ప్రమాద స్థలాన్ని కేంద్ర మంత్రులు హెచ్.డి.కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా కుమారస్వామి బాధితులకు భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలు రిటైర్మెంట్ వరకు క్వార్టర్స్‌లోనే ఉండేందుకు అనుమతిస్తామని, ఇతర ఉద్యోగులతో సమానంగా వారి పిల్లల చదువులకు పూర్తి ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



## క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ డోర్ నంబరింగ్ వ్యవస్థ" అమలు పురోగతిపై విజయవాడ నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఆస్తికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపును కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్తుల వివరాల సేకరణ, ప్రాపర్టీ పార్సెల్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, రోడ్ల మ్యాపింగ్, ఈఆర్‌పీ డేటా సమన్వయం వంటి ప్రక్రియలను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు.ప్రతి ఆస్తికి కేటాయించబడే క్యూఆర్ కోడ్ ద్వారా పౌర సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు సమావేశంలో డెప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించారు.

డిజిటల్ డోర్ నంబరింగ్ కార్యక్రమంలో డేటా నాణ్యత, భౌగోళిక గుర్తింపుల ఖచ్చితత్వం, ఆస్తి వివరాల సమగ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నగరాభివృద్ధి ప్రణాళికలు, పన్నుల నిర్వహణ, పౌర సేవల మెరుగుదలలో ఈ డిజిటల్ డేటా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు ఏ.యు.బి. శర్మ, హెలెన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విపిఏను సందర్శించిన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**(నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్)**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించారు. జస్మీత్ సింగ్ బింద్రా, ఐ ఆర్ టీ ఎస్ , చైర్‌పర్సన్,



విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, వి పి ఏ కార్యదర్శి ఏం . శంకర్ బాబుతో పాటు, ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. పర్యటన సందర్భంగా, ప్రధాన న్యాయమూర్తికి విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పనితీరు మరియు అభివృద్ధిపై సమగ్ర ప్రదర్శనను అందించారు. పోర్ట్ కార్యకలాపాలు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యాలు, మౌలిక సదుపాయాల విస్త రణ ప్రాజెక్టులు, ఆధునీక రణ కార్యక్రమాలు మరియు పోర్ట్ సామర్థ్యం మరియు పోటీతత్వాన్ని పెంపొందించడానికి చేపట్టే వ్యూహాత్మక వృద్ధి ప్రణాళికల యొక్క ముఖ్య అంశాలను బ్రీఫింగ్ కవర్ చేసింది. చైర్‌పర్సన్ ఈ ప్రాంతంలో సముద్ర వాణిజ్యం, లాజిస్టిక్స్ మరియు ఆర్థిక అభివృద్ధికి వి. పి. ఏ యొక్క గణనీయమైన సహకారాన్ని, అలాగే సుస్థిరత, డిజిటల్ పరివర్తన మరియు సామర్థ్యాన్ని పెంపొందించడానికి దాని ప్రయత్నాలను హైలైట్ చేశారు. "కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేసినందుకు ప్రధాన న్యాయమూర్తి చైర్‌పర్సన్ మరియు అతని బృందాన్ని అభినందించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మృతి చెందిన కుటుంబాలను పరామర్శ

**- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు తిప్పల నాగిరెడ్డి,**

**- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి గౌస్**

**నేటి శుభోదయ జూన్ 10, విశాఖపట్నం:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన విషాద ఘటనలో గాజువాక 66వ వార్డుకు చెందిన స్టీల్ ప్లాంట్ ఫోర్‌మాన్ కూనా ప్రభాకర్ దురదృష్టవశాత్తు మృతి చెందడం అత్యంత బాధాకరం. వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాము.మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన

ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి , మృతుడి కుటుంబానికి ధైర్యం చెబుతూ, కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కూనా ప్రభాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే



మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాము. అని తెలిపారుఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.ఎం.డి గౌస్ , 66వ వార్డు అధ్యక్షులు పెద్ది రెడ్ల ఈశ్వరరావు , వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పేరం రామకృష్ణ రెడ్డి , సిద్దయ్య, కె. రామనాయుడు మరియు ఇతర పార్టీ నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


# గొల్లపూడి పి.ఏ.సీఎస్ సభ్యులకు రూ.25 లక్షల డివిడెంట్లు

## రైతులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):**

విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులకు రూ.25,00,814ల డివిడెంట్లు మంజూరయ్యాయి. బుధవారం గొల్లపూడి పి.ఏ.సీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు రైతులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ సహకార సంఘాలు లాభాల్లో నడవడం హర్షణీయమన్నారు. రైతులకు డివిడెంట్లు ఇవ్వడం ద్వారా సహకార స్ఫూర్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. పి.ఏ.సీఎస్‌లను బలోపేతం చేసి రైతులకు మరిన్ని సేవలు అంది స్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులకు వడ్డీలేని రుణాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘాలు వెన్నెముక లాంటివని కృష్ణప్రసాదు పేర్కొన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించిన రైతులను ఎమ్మెల్యే అభినందించారు. పి.ఏ.సీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు, ఎరువుల విక్రయాలు



పారదర్శకంగా జరుగుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు, (గాంధీ), పి.ఏ.సీఎస్ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# "ప్రతి నీటి బొట్టును ఒడిసి పడదాం": ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

**సప్లయి ఛానెల్ పూడికతీత పనులకు శ్రీకారం.జిల్లాలోనే స్ఫూర్తిదాయకం: కలెక్టర్ లక్ష్మీశ**

**విజయవాడ, జూన్ 10 (నేటి శుభోదయ):**

"ప్రతి నీటి బొట్టు అమూల్యం...నీటిని ఒడిసి పట్టి జలధారను కాపాడుతూ, జలహారతితో జలమాతకు వందనం చేద్దాం" అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు.

జి.కొండూరు మండలం పినపాక గ్రామంలో 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ బుధవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం పిన పాక సప్లయి ఛానెల్ పూడికతీత అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. తొలుత గ్రామంలో అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పులివాగు నుంచి పినపాక గంగాదేవి చెరువు వరకు ఉన్న సప్లయి ఛానెల్ ను 1100 మీటర్ల పొడవునా పూడిక తీయనున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలతో పూడికతీత పనులు సాధ్యం కాని చోట రైతుల భాగస్వామ్యంతో యంత్రాలు పెట్టి పనులు చేస్తున్నట్లు వెల్లడించారు.

నీరు జీవనాధారం, జలధార ప్రకృతికి వరమని అభివర్ణించారు. 'జలహారతి జల సంరక్షణకు మన సంకల్పం' కావాలని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని ఎమ్మెల్యే సూచించారు. జలమే జీవం, జల సంరక్షణే ధర్మం అని, ఇది ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తుచేశారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాలని రైతులకు సూచించారు. పినపాక సప్లయి ఛానెల్‌లో పేరుకుపోయిన పూడిక తొలగిస్తే ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టులు, చెరువులు, కాలువల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని వివరించారు. నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు.ప్రతి ఇంటా ఇంకుడు



గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సంరక్షించాలని కోరారు. జల వనరులను కలుషితం చేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పూడికతీత పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో జలధార కార్యక్రమాన్ని ప్రతి నెలా నిర్వహిస్తామని గ్రామస్తులు తీర్మానించారు. నీటి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసేలా అందరికీ అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

పినపాకలో రైతుల భాగస్వామ్యంతో కాల్వ అభివృద్ధి పనులు చేపట్టడం జిల్లాలోనే తొలిసారి అని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాదు దీనికి చేయూతనిచ్చారని అన్నారు. ఈ పనులు పూర్తయితే చెరువుకు సులభంగా వర్షపు నీటి సరఫరా జరిగి చెరువు సాగు జలాలతో నిండుతుందని, రైతులకు సాగునీటి అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు. ఎమ్మెల్యే జిల్లాలోనే స్ఫూర్తి దాయకంగా నిలిచారని లక్ష్మీశ అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణలోగా ఎన్ఎస్‌టీఎల్ - సింహాచలం రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావాలి

**- ప్రభుత్వ విప్ గణబాబు**

**(నేటి శుభోదయ జూన్ : 11 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )** విశాఖ జూలై 28వ తేదీన జరగనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణ మహోత్సవంలోగా ఎన్ఎస్‌టీఎల్ (న్ ఎస్ టీ ఎల్ ) నుండి సింహాచలం వెళ్లే ప్రధాన రహదారిని 40 అడుగుల మేర విస్తరించే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, విశాఖపశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గణబాబు అధికారులను ఆదేశించారు.

బుధవారం ఆయన జీవీఎంసీ (జీవీఎంసీ ) అధికారులతో కలిసి ఈ రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా విప్ గణబాబు వారు మాట్లాడుతూ.. గిరి ప్రదక్షిణ రోజున లక్షలాది మంది భక్తులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జూలై 28 లోపే పనులన్నీ పూర్తి కావాలన్నారు.

అదేవిధంగా, సడగరం అప్పలనాయుడు మార్గ్ (రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్) నుండి కొత్తపాలెం వరకు ఉన్న రహదారి అభివృద్ధి



ప్రణాళికను ( ఆర్ డీ పీ ) ఆయన పరిశీలించారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి, రోడ్డును మరింత సులభతరం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ హేమావతి, యాస్ సి ప్రవీణ్ కుమార్, ఈఈ ప్రసన్న, డిఈఈ లు, ఏఈ లు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతన్న ముంగిటకు రాయితీ విత్తనం

**- కూటమి ప్రభుత్వంలో కర్షకుడికే పెద్దపీట**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**- రాయితీపై విత్తనాలు పంపిణీ ప్రారంభించిన మంత్రి**

**నిమ్మాడ, జూన్ 10, విశాఖపట్నం:** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, రైతుల పక్షపాత ప్రభుత్వంగా తన చిత్తశుద్ధిని చాటుకుంటోంది. రానున్న ఖరీఫ్ సీజన్ (2026-27) లో రైతన్నలకు ఏ లోటూ రాకుండా ఉండేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాన్ని పండుగ చేసే దిశగా అడుగులు వేస్తూ, రాయితీపై వరి విత్తనాల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు.

### రాయితీతో విత్తనాలు

సాగు ఖర్చును తగ్గించి రైతులకు అండగా నిలిచేందుకు, ప్రభుత్వం కిలో వరి విత్తనాలపై రూ. 10ల రాయితీని అందిస్తోంది. అలాగే, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గిరిజన రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తూ 90% రాయితీని అమలు చేస్తోందని అన్నారు, శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎక్కడా విత్తనాల కొరత రాకుండా ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. ప్రస్తుతం జిల్లాలో ఏకంగా 31,058 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు, అన్నదాతలు విత్తనాల కోసం ఇబ్బందులు పడకుండా, వారి గ్రామాల్లోని 'రైతు సేవా కేంద్రాల' ద్వారానే అన్ని రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉన్నాయని తెలిపారు,

### ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు

ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని



తగ్గించేలా పచ్చిరొట్ట ఎరువులను ప్రోత్సహిస్తున్నారు. అలాగే ఎక్కడా యూరియా కొరత రాకుండా, జూన్ నెల నుంచే పారదర్శకంగా వారం ముందుగానే కూపన్లు జారీ చేసి ఎరువులు సరఫరా చేయనున్నారు. , విత్తనాలు మరియు ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్ దందాలకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ జరిగేలా అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదావకాశాలను జిల్లాలోని రైతన్నలు సద్వినియోగం చేసుకుని ఆనందంగా సాగు పనులు ప్రారంభించాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, వెలమల విజయలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు, వెలమల కామేశ్వరరావు, బోయిన గోవిందరాజులు, బోయిన శ్రీనివాస్ , పినకాన అజయ్ కుమార్ , టెక్కలి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే జగన్ మోహన్ రావు, కోటబొమ్మాలి మండలం వ్యవసాయ అధికారి గోవిందరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ మరణాలు ప్రభుత్వ హత్యలే

- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాల్సిందే మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టీకరణ
- విశాఖపట్నంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్
- తప్పుల్ని ప్రశ్నిస్తే లోకేష్ కు ఫ్రస్ట్రేషన్ ఎందుకు ?
- పరామర్శకు వచ్చి ఎందుకంత అసహనం ?
- సూటిగా ప్రశ్నించిన గుడివాడ అమర్నాథ్
- రెండేళ్లలో 6వేల మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు
- 1800 మంది రెగ్యులర్ ఉద్యోగుల్నీ తీసేశారు
- ఎక్కడా లేని విధంగా ఉత్పత్తి ఆధారిత జీతాలు
- గుర్తుచేసిన అమర్నాథ్
- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంది జగనే
- అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపారు
- రేపు బాధితుల పరామర్శకు విశాఖకు జగన్
- గుడివాడ అమర్నాథ్ వెల్లడి

(నేటి శుభోదయ జూన్ 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )

దేశాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసిన విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనలో మరణాలు ముమ్మాటికీ కూటమి సర్కార్ చేసిన హత్యలే అని, వీటిపై ప్రశ్నిస్తే మంత్రి లోకేష్ తీవ్ర అసహనానికి గురై కార్మిక సంఘాలపై నోరు పారేసుకుంటున్నారని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు కారణాల్ని వెతకాల్సిన ప్రభుత్వ పెద్దలు,, నిస్సిగ్గుగా వైఎస్సార్సీపీపై విమర్శలకు దిగడం దారుణమని విశాఖలో మీడియాతో మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ క్షేపించారు. స్టీల్ ప్లాంట్ లో ప్రమాదానికి బాధ్యత వహిస్తూ మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రెస్ మీట్లో గుడివాడ అమర్నాథ్ ఇంకా ఏమన్నారంటే..

### నియంతలా లోకేష్ వ్యవహారశైలి

నిన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘటన రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో, భారీ భద్రతా ప్రమాణాలు అందుబాటులో ఉన్న కాలంలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మా వంతుగా మృతులు, బాధితుల కుటుంబ సభ్యుల్ని కలిసి ఓదార్చే ప్రయత్నం చేశాం. కనీసం మృతదేహాల్ని గుర్తుపట్టలేని పరిస్థితులు ఉన్నాయి. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వడంతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరాం. అలాగే క్షతగాత్రులకు 50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అడిగాం.

కానీ ఇవాళ ముఖ్యమంత్రి కుమారుడు, షాడో సీఎం లోకేష్ స్టీల్ ప్లాంట్ బాధితుల పరామర్శకు వచ్చారు.



ఆయన మాట్లాడిన తీరు చూసి ఈ ప్రాంతంలో ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఆయన దేనికి వచ్చారు, రాజకీయాలు మాట్లాడటానికే వచ్చారా లేక బాధితుల్ని పరామర్శించేందుకు వచ్చారా అనేది తెలియడం లేదు. అలాగే కేజీహెచ్ లో కార్మిక సంఘాల నాయకులతోనూ అదే తీరున మాట్లాడారు. అందులో ఆయన ఫ్రస్ట్రేషన్ అంతా కనిపించింది. ఆయన చేతకానితనం బయట పడటంతోనే ఫ్రస్ట్రేషన్ పుట్టుకొచ్చినట్లు అర్థమవుతుంది. ఆయన ఓ నియంతలా మాట్లాడారు. ఓ వ్యవస్థలో, సంస్థలో పనిచేసే తోటి వారికి ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులతో సమానంగానే భావిస్తాం. మీ ఇంట్లో ఎవరైనా పోయారా అని లోకేష్ అడగడం దారుణం.

### కార్మిక సంఘాలపై రెచ్చగొట్టే మాటలేంటి ?

బాధితుల తరపున కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మీ సమాధానం ఇంత రెచ్చగొట్టేలా ఉండాలా ? ఓదార్చాల్సిన సమయంలో రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు. కార్మిక సంఘాల్లో సీనియర్ నాయకుల్ని సైతం చులకనగా మాట్లాడారు. వాళ్లు కార్మిక సంఘాల్లోకి వచ్చే సమయానికి లోకేష్ పుట్టి కూడా ఉండడు. అధికారం ఉంది కదా అని వారిపై రెచ్చిపోయే మాట్లాడతారా ? విశాఖ ఉక్కు చరిత్రలో లోకేష్ వ్యాఖ్యలు, ఈ ప్రభుత్వం వ్యవహరించిన తీరు మాత్రం చెరిగిపోదు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో మీలా అందరికీ అక్రమ సంపాదన ఉండకపోవచ్చు కానీ ఇక్కడి కార్మిక నేతలకు ఆత్మగౌరవం మాత్రం ఉంటుంది. మీ తప్పిదాల వల్ల గత మాసాలుగా స్టీల్ ప్లాంట్ నిర్వీర్యం చేసే క్రమంలో జరిగిన ప్రమాదం ఇది. ఇవి ముమ్మాటికీ ఈ కూటమి ప్రభుత్వం హత్యలే. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక ఎప్పటి నుంచో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల్ని బలవంతంగా బయటికి పంపారు. ఉద్యోగుల్ని సైతం మెగా వీఆర్ఎస్ పేరుతో ఒత్తిడి తెచ్చి బయటికి పంపారు. ఈ రెండేళ్లలో 6 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల్ని బయటికి పంపారు. 1800 మంది రెగ్యులర్ ఉద్యోగుల్ని వీఆర్ఎస్ పేరుతో బలవంతపు రిటైర్మెంట్ ఇప్పించారు. 30 వేలు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు 15-16 వేలకు తగ్గిపోయారు. అంటే వారిపై పని ఒత్తిడి రెట్టింపైంది. దేశంలో ఎక్కడా లేని పద్దతుల్ని స్టీల్ ప్లాంట్ లో అమలు చేస్తున్నారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు ఇవ్వడం చేస్తున్నారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో ఈ విధానం ఉందో చెప్పాలి. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉంటారు. ఎగ్జిక్యూటివ్ లో బదిలీలు ఉంటాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు మాత్రం ప్లాంట్ లో ఉన్న యంత్రాలతో అనుబంధం ఉంటుంది కాబట్టి బదిలీలు చేయరు. కానీ మొదటిసారి గత మూడు నెలలుగా నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్ని కూడా బదిలీలు చేసేస్తున్నారు. ఈ మార్పులు చేర్పుల వల్ల ప్లాంట్ లో యంత్రాలపై ఉద్యోగులకు అవగాహన తగ్గిపోతుంది. మీ ప్రభుత్వం వచ్చాక చేతకాని తనం వల్ల చేస్తున్న మార్పులివి. హెచ్ఆర్ఏ, వైద్య సాయం వంటి సదుపాయాలు లేకుండా చేస్తున్నారు. ఎల్టీసీ సదుపాయం కూడా తీసేశారు. చివరికి ప్రాణాలకు భద్రత కూడా లేకుండా చేశారు. దానికి సమాధానం చెప్పలేక ఫ్రస్ట్రేషన్ తో కార్మిక సంఘాలపై తిరగబడుతున్నారు. లోకేష్ తీరు ఏమాత్రం సరికాదు.

### పవన్‌వి అవగాహన లేని మాటలు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అసలు అవగాహన ఉందా లేదా కూడా తెలియడం లేదు. నిన్న జరిగిన ఘటనకూ గత ప్రభుత్వానికీ, జగన్మోహన్ రెడ్డి వారికీ ఏం సంబంధం ? ఈ రెండేళ్లలో కానీ, గతంలో కానీ ప్రధాని మోడీతో కానీ, కేంద్రంతో కానీ మాట్లాడి ఈ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దని అడిగారా ? తిరిగి ఇప్పుడు కార్మికుల్ని నిందిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఉన్న విధానాలు చూడాలని గతంలో పవన్ చెప్పలేదా ? కార్మికులు ముందుకొస్తే పోరాటం చేస్తానని మరోసారి చెప్పారు. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి వారిపై అన్యాయంగా విమర్శలకు దిగుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తొలిసారి ప్రకటన రాగానే...ఐదారు రోజుల వ్యవధిలోనే ప్రధాని మోడీకి జగన్మోహన్ రెడ్డి లేఖ రాశారు. ఈ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, దానికి చాలా ఆప్షన్స్ ఉన్నాయని, ఇది రాష్ట్ర ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ప్లాంట్ అని ప్రధానికి గుర్తుచేశారు. కానీ పవన్ కళ్యాణ్ ఏదైనా లేఖ రాస్తే చూపించాలి. 2022 నవంబర్ 12న విశాఖకు ప్రధాని మోడీ వస్తే.. అక్కడ కూడా జగన్మోహన్ రెడ్డి వారు వేదికపైనా ప్రైవేటీకరణ చేయొద్దని కోరారు. అదే సంవత్సరం కార్మిక సంఘాలు జగన్మోహన్ రెడ్డి వారిని కలిసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలని కోరితే.. అప్పట్లో తీర్మానం చేసి పంపారు. పరిశ్రమల మంత్రిగా గౌతంరెడ్డి ఉన్నారు. నేనూ అసెంబ్లీలో ఉండి స్టీల్ ప్లాంట్ కు వ్యతిరేకంగా ప్రసంగం చేసిన రికార్డులు ఉన్నాయి. అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి పంపించాం.

### ప్రైవేటీకరణను అడ్డుకుంది జగనే

ఉక్కు శాఖ మంత్రిగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టాక 2021 జనవరిలో తాము స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకుంటే, అప్పట్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం ద్వారా దీన్ని వ్యతిరేకించి పంపినట్లు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వారు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని అయినా, రెగ్యులర్ ఉద్యోగిని అయినా తీసేశారా, నెలలవారీ జీతం, బోనస్, వైద్య సదుపాయాలు ఆగిన సందర్భాలు ఉన్నాయా అనేది కార్మిక సంఘాల్ని అడిగితే తెలుస్తుంది. ఆ రోజు వైఎస్సార్సీపీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంది కాబట్టే ఇప్పటికీ అది ముందుకెళ్లకుండా ఆగింది. కానీ పవన్ కళ్యాణ్ ఇవాళ జగన్మోహన్ రెడ్డి వారి మీద, వైఎస్సార్సీపీ మీద రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. లోకేష్ మమల్ని టీమ్ లెవెన్ అంటున్నారు, ఆయన పార్టీ, కూటమి ఎలా గెలిచిందో అందరికీ తెలుసు కాబట్టి టీమ్ ఈవీఎం అనాల్సి ఉంటుంది. బీజేపీతో ప్రత్యక్షంగా, ఈసీతో పరోక్షంగా పొత్తు పెట్టుకోకపోతే మీకు ఇన్ని సీట్లు ఎలా వస్తాయి? లోకేష్ అధికార మదమెక్కి నీచంగా మాట్లాడుతున్నారు. సింహాచలంలో గోడ కూలిపోయి 8 మంది చనిపోతే లోకేష్ కు పెద్ద ఘటన కాదు, స్టీల్ ప్లాంట్ లో 8 మంది చనిపోతే అదీ పెద్ద ఘటన కాదు, తిరుపతిలో తోపులాట జరిగి ఆరుగురు చనిపోయినా మీకు పెద్ద ఘటన కాదు. ఇంకా ఎంత మంది పోతే మీకు ఇదో పెద్ద ఘటన అని అర్థమవుతుంది.

14 వేల కోట్లు ఇచ్చి కాపాడామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. అవి ఇచ్చింది బ్యాంకులకు మాత్రమేనని అందరికీ తెలుసు. ఉద్యోగుల సంక్షేమానికో, ప్లాంట్ కోసమో మీరు రూపాయి ఖర్చుపెట్టలేదు. ఉద్యోగుల్ని తొలగించే వీఆర్ఎస్ కోసం ఆ డబ్బులు ఖర్చుపెట్టారు. ఇలాంటి సందర్భాల్లో అయినా నీచంగా రాజకీయాలు మాట్లాడొద్దని కోరుతున్నాం. ఇప్పటికైనా మీరు చేసిన వ్యాఖ్యలకు కార్మిక సంఘాలకు, మృతుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. ఇవన్నీ మీ కూటమి ప్రభుత్వం చేసిన హత్యలే. 2012లో ప్రమాదం జరిగితేనే 25 లక్షలు ఇచ్చారు. మేం అధికారంలో ఉండగా ఎల్జీ పాలిమర్స్ ఘటనలో కోటి రూపాయలు పరిహారం ఇచ్చాం. ఇప్పుడు కేంద్రమంత్రి 25 లక్షలు ఇస్తామని చెప్పినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూపాయి కూడా ప్రకటించలేదు. ఎట్టి పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాల్సిందే. రేపు వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ విశాఖకు వస్తున్నారు. నేరుగా ఎయిర్ పోర్టు నుంచి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్పత్రులకు వెళ్లి బాధితుల్ని పరామర్శించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పబోతున్నారని గుడివాడ అమర్నాథ్ తెలిపారు.

---

## హోం మంత్రి వంగలపూడి అనితకు
# అణుకు గిరిజనుల కృతజ్ఞతలు

(నేటి శుభోదయ జూన్ : 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )

కోటవురట్ల మండలం అణుకు గ్రామానికి చెందిన గిరిజనులు బుధవారం నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. విషయాన్ని గిరిజనులు ప్రస్తావించారు. గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు గిరిజనులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా అణుకు గ్రామానికి రూ.3 కోట్ల వ్యయంతో రహదారి మంజూరు చేయడం,



ఈ సందర్భంగా వారు తమ ప్రాంతంలో సాగు చేసిన అటవీ ఉత్పత్తులు, పనస పండ్లు, పైనాపిల్ తదితర ఉత్పత్తులను మంత్రికి అందజేశారు. అణుకు గ్రామ ప్రజలతో మంత్రి అనితకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేస్తూ, ఈ ఏడాది సంక్రాంతి పండుగను ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అణుకు గ్రామంలో జరుపుకున్న గ్రామంలో రేషన్ సదుపాయం కల్పించడం, త్వరలో బీఎస్ఎన్ఎల్ టవర్ అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, తమను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి అనితకు ధన్యవాదాలు తెలిపారు.

---

## మోడీ పాలనలో
# అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు

**ప్రజలు ఆనందంతో ఉన్నారు**

**బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి**

తాడేపల్లిగూడెం జూన్ 10 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ): ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నా



యని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. ప్రధాని మోడీ 12 ఏళ్ల పరిపాలన సందర్భంగా బుధవారం బిజెపి పట్టణ కమిటీ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత డీఎస్ చెరువు వద్దగల రామాలయంలో ప్రధాని సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం ప్రధానిగా జవహర్లాల్ నెహ్రూ సృష్టించిన రికార్డును నేడు నరేంద్ర మోడీ అధిగమించారని అన్నారు. సంక్షేమం.. అభివృద్ధి అట్టడుగు ప్రజలందరికీ అందించిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. సభాధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ అత్యధిక కాలం ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత మోడీకే దక్కుతుందని అన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పడాల కావ్య రెడ్డి, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు సూర్య కుమారి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, ఓబీసీ మోర్చా నేత ఇమ్మంది బెనర్జీ, అచ్యుత దుర్గాప్రసాద్, పంజా బసవన్న, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

---




# ఇది రాజకీయాలకు సమయం కాదు...

- బాధిత కుటుంబాలకు అండగా నిలిచి ఉక్కు పరిశ్రమను మరింత బలోపేతం చేయాల్సిన సమయం
- ఉక్కు కార్మికుల విషాదాన్ని కూడా రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గం... గొడ్డలి పార్టీ శవ రాజకీయాలు మానుకోవాలి
- నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఉక్కు పరిశ్రమను లాభాల బాటలో నడిపించింది కూటమి ప్రభుత్వం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

(నేటి శుభోదయ జూన్ 10 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )

విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన విషాద ఘటన అత్యంత దురదృష్టకరమని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమను అటు యాజమాన్యం, ఇటు కార్మికులు కలిసి పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా తీసుకెళ్తున్న సమయంలో ఇలాంటి దుర్ఘటన జరగడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... విశాఖ ఉక్కు పరిశ్రమ కేవలం ఒక పరిశ్రమ కాదని, తెలుగు ప్రజల త్యాగాలు, పోరాటాలతో నిర్మితమైన ఆత్మగౌరవ చిహ్నమని అన్నారు. ప్రజల ధనంతో రూ.40 వేల కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ కర్మాగారాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గడిచిన 24 ఏళ్లుగా కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిశ్రమను నిలబెట్టేందుకు కృషి చేశారని గుర్తుచేశారు.

### ఉక్కు పరిశ్రమకు ఊపిరి పోసింది కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్ మాత్రమే పనిచేసేదని, నేడు మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పల్లా తెలిపారు. అప్పట్లో 30 శాతానికి పడిపోయిన ఉత్పత్తి నేడు 95 శాతానికి చేరుకుందని, నెలకు ఆరు లక్షల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రూ.11,440 కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీ అందించి ఉక్కు పరిశ్రమకు కొత్త ఊపిరి పోసిందన్నారు. అంతకుముందు రూ.3,500 కోట్ల సహాయంతో పరిశ్రమను నిలబెట్టిన ఘనత కూడా ఎన్డీయే ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ఇతర రూపాల్లో సుమారు రూ.2,600 కోట్ల మేర చేయూత అందించిందన్నారు. ఇదే సమయంలో గత ప్రభుత్వం ప్రతి నెలా మొదటి తేదీన సుమారు రూ.100 కోట్ల విద్యుత్ బిల్లులను వసూలు చేస్తూ పరిశ్రమపై అదనపు భారం మోపిందని పేర్కొన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఉక్కు పరిశ్రమను గట్టెక్కించి లాభాల బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

### శవ రాజకీయాలు మానుకోవాలి

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైందో జగన్ రెడ్డి ప్రజలకు చెప్పాలని పల్లా డిమాండ్ చేశారు. ఆయన అధికారంలో ఉన్న కాలంలోనే కార్మికులు నాలుగేళ్లపాటు టెంట్లు వేసుకుని ఉద్యమించారని



గుర్తుచేశారు. నేడు స్టీల్ ప్లాంట్‌పై ప్రేమ చూపిస్తున్న వారు అప్పట్లో ఏమి చేశారో విశాఖ ప్రజలు, కార్మికులు మరచిపోలేదన్నారు.

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకపోయి ఉంటే ఈ ప్లాంట్ ఈ పాటికే అమ్ముడై ఉండేదన్నారు. నేడు జగన్ రెడ్డి పక్కన నిలబడి మాట్లాడుతున్న కొందరు కార్మిక నాయకులే గతంలో ప్లాంట్‌ను నిలబెట్టేందుకు రూ.3 వేల కోట్ల సహాయం అవసరమని చెప్పారని గుర్తుచేశారు. అలాంటిది కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ అందించి పరిశ్రమకు భరోసా కల్పించిందన్నారు.

విషాద ఘటనను కూడా రాజకీయాలకు వాడుకోవడం అత్యంత దుర్మార్గమని, ఒకప్పుడు ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి శవ రాజకీయాలకు పాల్పడటం బాధాకరమని పల్లా మండిపడ్డారు. ఉక్కు కార్మికుల కన్నీళ్లపై రాజకీయాలు చేయడం మానుకుని, పరిశ్రమ భవిష్యత్తుపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు

### బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ స్పందించి సహాయక చర్యలను వేగవంతం చేశారని తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని, కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాల పునరావాసం, పిల్లల విద్య, భవిష్యత్తు భద్రత విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని అన్నారు.


మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున సాయం ప్రకటించిందన్నారు. అదనంగా మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మేరకు శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం, కుటుంబ సభ్యుడికి శాశ్వత ఉద్యోగం, పిల్లల విద్యకు పూర్తి సహాయం, స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, కుటుంబ సభ్యుడికి ఉద్యోగం, పిల్లల విద్యకు సహాయం, నివాస సదుపాయాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రకటించిన హామీల అమలులో భాగంగా పరిహారాన్ని బాధిత కుటుంబాల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు.గత 22 నెలల్లోనే కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని ఐదుసార్లు విశాఖ ఉక్కు పరిశ్రమకు తీసుకువచ్చి పరిస్థితులను వివరించామని, ప్రమాదం జరిగిన వెంటనే ఆయన స్పందించి అదే రాత్రి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి పరిహారం ప్రకటించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

### పూర్తి సామర్థ్యంతో ఉక్కు పరిశ్రమ...
### భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

ప్రస్తుతం 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఉన్న పరిశ్రమను భవిష్యత్తులో 10 మిలియన్ టన్నుల సామర్థ్యానికి తీసుకెళ్లే దిశగా చర్యలు చేపడతామని పల్లా తెలిపారు. ప్లాంట్‌ను పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యానికి ఎలా తీసుకెళ్లాలి, అందుకు అవసరమైన వనరులను ఎలా సమకూర్చాలన్న దానిపైనే తమ ప్రధాన దృష్టి ఉందన్నారు.

ఇటీవల ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా పరికరాల నిర్వహణ, సాంకేతిక భద్రత అంశాలపై మరింత శ్రద్ధ అవసరమని గుర్తించామని, సాంకేతిక బృందాలు ఇప్పటికే ఆ దిశగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర సాంకేతిక విచారణతో పాటు భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను మరింత బలోపేతం చేసి పూర్తి సామర్థ్యంతో నడిపించడం, కార్మికుల సంక్షేమాన్ని కాపాడటం, బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.



# దూసుకెళుతున్న పెద్ది

### రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణను అందుకుంటున్న ఈ చిత్రం వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఆరు రోజుల్లోనే రూ.332.1 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో క్రీడలు, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, పోరాట స్ఫూర్తి వంటి అంశాలను దర్శకుడు బుచ్చిబాబు సాన ఆకట్టుకునే విధంగా చూపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటించగా, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ, రవికిషన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'పెద్ది' చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.218.50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తిస్థాయి విజయాన్ని నమోదు చేయాలంటే దాదాపు రూ.220 కోట్ల షేర్ వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే గ్రాస్ పరంగా రూ.440 కోట్ల మార్క్‌ను అందుకోవాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రూ.332 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించిన నేపథ్యంలో బ్రేక్ ఈవెన్ చేరుకోవడానికి మరో రూ.108 కోట్ల గ్రాస్ అవసరమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 'పెద్ది' ఇప్పటికే బ్రేక్ ఈవెన్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

# ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

### పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట

ప్రకృతిని ప్రేమించడం.. అనుభవించడం.. ఆస్వాదించడం.. ఆనందించడం అందరికీ తెలుసు. కాన ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకలు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు – ఆనందాలు, బాధలు – భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు. భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర



పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతల కు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.

# తండ్రికి తగ్గ తనయుడిగా బాలకృష్ణ

### బాలకృష్ణ జన్మదినోత్సవం

### అభినందనలు తెలిపిన ప్రముఖులు

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటప్రస్థానం ఒక అద్భుతం. ఆయన జన్మదినం సందర్భంగా చిత్ర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న బాలయ్య కెరీర్‌లో ఎన్నెన్నో అపూర్వ విజయాలు, మరెవరికీ సాధ్యంకాని రికార్డులు. వసూళ్ల పరంగానే కాదు, థియేటర్లలో అత్యధిక రోజులు ప్రదర్శించబడిన సినిమా కూడా బాలయ్య పేరుతోనే ఉంది. బాలకృష్ణ పని అయిపోయింది అని విమర్శకులు భావించిన ప్రతిసారీ మాస్ కంబ్యాక్ ఇవ్వడమే కాదు బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులతో విమర్శకుల నోళ్లు మూయించాడు. మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు ఐదవ కుమారుడిగా 1960 జూన్ 10న బాలకృష్ణ జన్మించారు. తండ్రి నేర్పిన అపారమైన వృత్తి నిబద్ధత, క్రమశిక్షణ, తల్లి బసవరామతారకం అందించిన ప్రేమానురాగాలు బాలయ్యను ఒక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయి. ఓవైపు బడిలో పాఠాలు చదువుకుంటూనే 1974లో ఎన్టీఆర్ నటించిన తాతమ్మకల సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యాడు బాలయ్య.



అన్నదమ్ముల అనుబంధం, వేములవాడ భీమకవి, దానవీరశూరకర్ణ, శ్రీమద్విరాటపర్వము, శ్రీతిరుపతి వేంకటేశ్వర కళ్యాణం, రౌడీరాముడు–కొంటె కృష్ణుడు, అనురాగదేవత, సింహం నవ్వింది, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' వంటి చిత్రాలలో తండ్రి ఎన్టీఆర్ తో కలిసి నటించి మెప్పించాడు బాలయ్య. 1984లో సాహసమే జీవితం సినిమాతో సోలో హీరోగా మారారు. కానీ ఆ సినిమా ఆశించినంతగా ఆడలేదు. తొలిమూడు సినిమాలు ఫ్లాప్ అవడంతో బాలయ్యపై విమర్శలు వచ్చాయి. కానీ నాలుగవ సినిమాగ వచ్చిన మంగమ్మగారి మనవడు'తో బాలయ్య తన పవర్ ఏంటో చూపించాడు. ఆ సినిమా ఏకంగా 565 రోజులు ఆడి రికార్డులు క్రియేట్ చేసింది.

# ఆల్ఫా టీజర్ విడుదల

### భారీ యాక్షన్ సీన్లఓ కొత్తగా ఆలియా భట్

**యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్ఫ్÷ట్లు, ÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది. మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.**






# నిర్మాతగా నాగచైతన్య..

### కీలక పాత్రలో భూమిక చావ్లా

అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దూత' సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల 'దూత-2' పూజా కార్యక్రమాలతో పాటు షూటింగ్ కూడా అధికారికంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నాగార్జున ముఖ్య అతిథిగా విచ్చేసి క్లాప్ కొట్టారు. ఈ సిరీస్ ద్వారా నాగచైతన్య సరికొత్తగా నిర్మాత అవతారమెత్తడం విశేషం. చైతన్య నిర్మిస్తున్న తొలి ప్రాజెక్ట్ ఇదే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో రాబోతున్న ఈ సీజన్‌కు కూడా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఫస్ట్ సీజన్‌లోని పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ ఈసారి కూడా అలరించనున్నారు. కాగా, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో ప్రముఖ నటి భూమిక చావ్లా ఒక కీలక పాత్రలో నటిస్తోంది. గతంలో వీరిద్దరూ 'సవ్యసాచి' (2018) లో కలిసి నటించారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.




# టాక్సిక్ దసరాకు షిఫ్ట్

**కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బడ్జెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా సమాచారం ప్రకారం 'టాక్సిక్' సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట. ముఖ్యంగా అక్టోబర్ తొలి వారం లేదా మూడో వారంలో విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు కన్నడ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి రిలీజ్ డేట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది.**

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .